## క్లుప్తంగా

### అంతర్గత డ్రెయిన్ల అభివృద్ధిపై దృష్టి



గుడివాడరూరల్: పట్టణ పరిధిలోని అంతర్గత డ్రెయిన్ల సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. స్థానిక ఏలూరురోడ్డులోని టీడీపీ కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సోమవారం ఎమ్మెల్యే సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ శివారు కాలనీలైన ధనియాలపేట, వాంబేకాలనీ, న్యూ ఇందిరానగర్ కాలనీల్లో రూ.10 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో కాలనీ సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో ఆర్డీఓ జి.బాలసుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

### 'చలో విజయవాడ'ను జయప్రదం చేయండి



పమిడిముక్కల: పెండింగ్ బకాయిలు తదితర సమస్యల పరిష్కారానికి మంగళవారం విజయవాడ ధర్నాచౌక్ వద్ద జరిగే రాష్ట్ర స్థాయి ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఉపాధ్యాయులకు ఫ్యాప్టో పిలుపు నిచ్చింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. సీపీఎస్ రద్దు చేయాలని, పాత పెన్షన్ అమలు చేయాలని, ఉద్యోగులకు వెంటనే డీఏ ప్రకటించాలని, 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు డి.కోటయ్య, ఎం.ఫికోల్, ఎం.ముతహర్‌అలీ, ఏ.అశోక్, కె.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### ఆరుతెగళపాడు పాఠశాలకు స్వచ్ఛ అవార్డు



కలిదిండి(కైకలూరు): జిల్లా స్థాయిలో ఉత్తమ స్వచ్ఛ స్కూల్ అవార్డును కలిదిండి మండలం ఆరుతెగళపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల దక్కించుకుంది. స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి సంబంధించి స్వచ్ఛాంధ్రప్రదేశ్ అవార్డు–2025కు ఆరుతెగళపాడు పాఠశాల ఎంపికైంది. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి నుంచి పాఠశాల హెచ్‌ఎం ఏ.శ్రీనివాసరావు బహుమతి, ప్రశంసా పత్రాన్ని సోమవారం అందుకున్నారు. కార్యక్రమంలో ఆరుతెగళపాడు ఉపాధ్యాయులు నున్న శ్రీనివాసరావు, లూయిస్, డీవీ.నాగేశ్వరరావు, ఐ.రమేష్, కె.వెంకట కృష్ణ, ఏ.రాజేంద్రప్రసాద్, జె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

### పోలరాజ్ కాలువలో గుర్రపు డెక్క తొలగింపు



మండవల్లి: పోలరాజ్ పంట కాలువ పెరికెగూడెం నుంచి నాగేంద్ర స్వామి ఆలయం వద్ద వరకు నాలుగు కిలోమీటర్ల మేర పంట కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్కను, చెత్త పూడిక పనులను రెండు రోజుల నుంచి గన్నవరం నీటి సంఘం అధ్యక్షుడు కూనపురెడ్డి వెంకట బాలకోటేశ్వరరావు పర్యవేక్షణలో తొలగిస్తున్నారు. పెరికెగూడెం పార్టీ ప్రధాన కార్యదర్శి శేషబాబు, చెన్నంశెట్టి నందకిషోర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

### తాడంకి హెచ్‌ఎం ప్రసాద్‌కు స్వచ్ఛాంధ్ర అవార్డు



పమిడిముక్కల: తాడంకి హైస్కూల్ హెచ్‌ఎం యలమంచిలి శివనాగప్రసాద్ స్వచ్ఛాంధ్ర అవార్డుకు ఎంపికయ్యారు. మచిలీపట్నంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, కలెక్టర్ డీకే బాలాజీ చేతుల మీదగా అవార్డు అందుకొన్నారు. ప్రతి నెలా మూడో శనివారం ఒక్కొక్క లక్ష్యం నెరవేరే విధంగా ప్లాస్టిక్ నిషేధం, మొక్కల పెంపకం, తడిపొడి చెత్త, పొగాకు నిషేధంపై అవగాహన ర్యాలీలు నిర్వహించడం వలన అవార్డు లభించినట్లు హెచ్‌ఎం ప్రసాద్ పేర్కొన్నారు.

# పోస్టాఫీస్ మార్చారు.. సూచికబోర్డు మరిచారు

**పోస్ట్‌మాస్టర్ తీరుపై అసంతృప్తి**



గతంలో ఉన్న పోస్టాఫీస్ ప్రాంతంలో ఏర్పాటు చేయని సూచిక బోర్డు

నందివాడ: మండలంలోని జనార్దనపురం గ్రామంలో పురాతన కాలం నుంచి అద్దె భవనంలో ప్రజలకు విస్తృతమైన పోస్టల్ సేవలందించిన భవనం శిథిలావస్థకు చేరడంతో ఆ తపాలా కార్యాలయాన్ని ఖాళీ చేశారు. కార్యాలయం ఎక్కడికి మార్చారో సూచిక బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

**తపాలా అధికారి నిర్లక్ష్యం?**

జనార్దనపురం తపాలా కార్యాలయానికి ఇటీవల వచ్చిన తపాలా అధికారి నిర్లక్ష్యపు పోకడలతో తాము ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న అధికారి దురుసు తనంతో ఏ విషయాన్ని అడిగినా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సాంకేతిక లేదా ఇతరత్రా సమస్యలు ఏర్పడితే నెలల తరబడి మధుపరులకు అందించే సేవలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు. ఇదే కార్యాలయంలో పనిచేసే మహిళా ఉద్యోగిని సైతం సహకరించకపోవడంతో సాధారణ మధుపరులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక లావాదేవీల విషయంలో ఎంతో నమ్మకం ఉన్న పోస్టల్ శాఖలో ఇటువంటి నిర్లక్ష్యపు సిబ్బందితో ఆ శాఖ పేరు ప్రఖ్యాతులు మసకబారుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ప్రజలకు సేవలు అందించే విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## బాణసంచా తయారీకి అనుమతులు తప్పనిసరి



బాణసంచా దుకాణాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ చంటిబాబు

గుడివాడరూరల్: అనుమతులు లేకుండా బాణసంచా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గుడివాడ తాలూకా ఎస్‌ఐ ఎన్.చంటిబాబు హెచ్చరించారు. మండలంలోని బాణసంచా దుకాణాలను ఎస్‌ఐ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో బాణసంచా విక్రయ దుకాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా బొమ్ములూరులో గతంలో నేల టపాసులు తయారు చేస్తున్న 20మందిని బైండోవర్ చేసి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పు చొప్పున రూ.20 లక్షలు మండల మేజిస్ట్రేట్ వద్ద బైండోవర్ చేసినట్లు తెలిపారు. అక్రమంగా బాణసంచా విక్రయాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

### పెరటి తోటల పెంపకంలో పెరికెగూడెం ఫస్ట్

మండవల్లి: స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర ప్రోగ్రాంలో భాగంగా పెరటి తోటల పెంపకంలో ఉత్తమ ఫలితాలు సాధించిన గ్రామ సంఘం పెరికెగూడెం అని వెలుగు ఏపీఎం రాజశ్రీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ప్రథమ స్థానంలో ఉన్నందున అవార్డు సాధించినట్లు పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు అందించిన ఎస్‌హెచ్‌జీ మహిళలకు, వీఓఏలకు అభినందనలు తెలిపారు.

### నేడు జీఎస్టీపై అవగాహన

ముదినేపల్లి రూరల్: మండలంలోని అన్ని హైస్కూళ్లలో మంగళవారం జీఎస్టీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి హైస్కూల్‌కు ఒక జీఎస్‌డబ్ల్యూఎస్ ఉద్యోగిని అనుసంధానిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అన్ని పాఠశాలల యాజమాన్యాలు ఈ కార్యక్రమాన్ని విధిగా నిర్వహించాలని పేర్కొన్నారు.

**13 నుంచి ఎఫ్‌ఎ–2 పరీక్షలు**

ఈ నెల 13 నుంచి 16 వరకు ఎఫ్‌ఎ–2 పరీక్షలు నిర్వహించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రాథమిక పాఠశాలలకు సంబంధించి రెండు రోజుల్లో నాలుగు పరీక్షలు, ఉన్నత పాఠశాలలకు సంబంధించి మూడు రోజుల్లో ఆరు పరీక్షలు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## రచయిత ఐలయ్యకు సత్కారం



ఐలయ్యను సత్కరిస్తున్న తెలుగు భాషా వికాస్ సమితి సభ్యులు

గుడివాడ టౌన్ : స్థానిక ఎన్జీఓస్ హోంలో తెలుగు భాషా వికాస్ సమితి ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకుని ప్రముఖ కవి, రచయిత శీల అనిలేష్ (ఐలయ్య) ను గుర్రం జాషువా సాహితీ పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గుర్రం జాషువా స్ఫూర్తిని ప్రతిఒక్కరూ గుర్తించి సాంఘిక అసమానతలపై నిరంతరం పోరాడాలన్నారు. సామాజిక అసమానతలు వాటి ప్రభావం, సమాజం నేర్చుకోవాల్సిన అంశాలపై ఐలయ్య రచనలు ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో తెలుగు భాషా వికాస్ సమితి కన్వీనర్ డీఆర్‌బీ ప్రసాద్, నేలపాటి శామ్యూల్, పీవీ సత్యనారాయణ, కె.సురేష్, లంక సురేంద్ర, జి.మోహన్‌బాబు, ఎన్జీఓస్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ ఫరీద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

### దీపావళి షాపులకు దరఖాస్తు చేసుకోండి

గుడివాడ టౌన్ : దీపావళిని పురస్కరించుకుని రిటైల్ షాపుల నిర్వహణకు దరఖాస్తు చేసుకోవాలని ది గుడివాడ రిటైల్ ఫైర్ క్రాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డి. మహేష్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఇందుకుగాను స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. 11వ తేదీ లాటరీ పద్ధతిలో షాపుల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ జంపాన ధనలక్ష్మి

పమిడిముక్కల: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని తాడంకి సర్పంచ్ జంపాన ధనలక్ష్మి పేర్కొన్నారు. తాడంకి హైస్కూల్లో సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన మండల స్థాయి ఆటల పోటీలను సర్పంచ్ ప్రారంభించారు. సీనియర్, జూనియర్ విభాగంలో బాలురు, బాలికల కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్, షటిల్ జట్లను ఎంపిక చేసినట్లు పీడీ రవీంద్ర తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రసాద్, మాజీ సర్పంచ్ జక్కా శ్రీనివాసరావు, విద్యాకమిటీ చైర్మన్ వీరంకి రేవతి పాల్గొన్నారు.

### 8న ప్రజాభిప్రాయ సేకరణ

గుడివాడ టౌన్ : గుడివాడ పురపాలక సంఘం మాస్టర్ ప్లాన్ రూపకల్పన, విజన్ డాక్యుమెంట్ తయారీలో ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8వ తేదీ ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ సమావేశం హాల్లో ఏపీసీఆర్డీఏ, ఆర్‌వీ ఇంజినీరింగ్ కన్సల్టెన్స్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయాలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు, సంస్థలు, సంఘాలు, మేధావులు హాజరై తమ అభిప్రాయాలను తెలియ చేయాలని ఆయన కోరారు.

### పేదలను ఆదుకోవడమే లక్ష్యం



పేదలకు వస్త్రాలను అందజేసిన మానవత సంస్థ అధ్యక్షుడు త్రివిక్రమరావు

పామర్రు: పేదలను ఆదుకోవడమే ప్రధాన లక్ష్యంగా మానవత సేవా సంస్థ పని చేస్తోందని ఆ సంస్థ అధ్యక్షుడు నూతలపాటి త్రివిక్రమరావు పేర్కొన్నారు. స్థానిక సంస్థ కార్యాలయం వద్ద పలువురు పేదలకు నూతన వస్త్రాలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన జన్యావుల వెంకటేశ్వరరావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని వారి కుటుంబ సభ్యులు పేదలకు మానవత ద్వారా నూతన వస్త్రాలను అందజేసినట్లు పేర్కొన్నారు. మానవత ప్రతినిధులు సీతాల ప్రసాద్, పీఎంఎస్ ప్రసాద్, సోమవరపు రామారావు,సోమశేఖర్, సుధాకర్, ప్రభాకరరావు, వెంకటరావు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెదపాలపర్రు సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ముదినేపల్లి విద్యుత్ ఏఈ పూర్ణచంద్రరావు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని పేరూరు, రెడ్డిపూడి గ్రామాల్లో విద్యుత్‌లైన్లకు దగ్గరలో ఉన్న చెట్లను కొట్టడం వల్ల అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

### అధ్యాపకుడికి అవార్డు



అవార్డు అందుకుంటున్న వాసుబాబు

మొవ్వ: స్థానిక క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒకేషనల్ అధ్యాపకుడు అప్పికట్ల వాసుబాబును ఆదివారం ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వేములపల్లి మాణిక్యాలరావు ఆదర్శ ఉపాధ్యాయ అవార్డుతో అవనిగడ్డ ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ సత్కరించారు. మండలి వెంకటకృష్ణారావు శత జయంతి సందర్భంగా విద్యాసేవ, కళాసేవ, వేములపల్లి మాణిక్యాలరావు ఆదర్శ అధ్యాపక పురస్కార ప్రధాన కార్యక్రమాన్ని విద్యార్థి వికాస వాహిని ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవారం మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ప్రిన్సిపాల్ డి.సత్యనారాయణ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు వాసుబాబుకు అభినందనలు తెలిపారు.

### 9న ఆర్‌ఎస్‌ఎస్ మండల సమావేశం

ముదినేపల్లి రూరల్: ఆర్‌ఎస్‌ఎస్ ముదినేపల్లి సంఘ మండల సమావేశం ఈ నెల 9న స్థానిక లిటిల్ ఫ్లవర్ హైస్కూల్లో జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. విజయవాడకు చెందిన విభాగ్ ప్రచార ప్రముఖ్ సీహెచ్‌వీఎన్ మూర్తి, అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు.

### విధులు సక్రమంగా నిర్వహించండి

నందివాడ: ఉద్యోగులందరూ తమ విధులను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ మల్లేశ్వరి పేర్కొన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ స్వమిత్ర సర్వే, జీఎస్టీపై అవగాహన, ఉపాధి పనులు, ఈకేవైసీలను సక్రమంగా నిర్వహించాలన్నారు. నందివాడ మండల పురోగతిని పెంచాలని సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ అధికారి అమీర్‌బాషా, విజయ దేవరాజు పాల్గొన్నారు.

### ప్రజల ప్రాణాలతో చెలగాటం తగదు

ముదినేపల్లి రూరల్: కల్తీ మద్యం సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ప్రభుత్వానికి తగదని వైఎస్సార్ సీపీ బూత్ లెవల్ కమిటీ జిల్లా వైస్ చైర్మన్ మంగినేని బాబ్జీ అన్నారు. ముదినేపల్లిలో సోమవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వం ద్వారా నాణ్యమైన మద్యాన్ని సరఫరా చేయగా నేడు ప్రైవేటుపరం చేసి కల్తీ మద్యాన్ని ఏరులై పారుస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. కల్తీ మద్యం వెనుక అధికారపార్టీ నేతల హస్తం ఉండడం దారుణమన్నారు. కల్తీ మద్యాన్ని అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

### ఓటు చోరీపై సంతకాల సేకరణ

కలిదిండి(కైకలూరు): కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలిస్తూ, ప్రజల ఓటును దోచుకుని మూడోసారి గద్దెనెక్కిందని ఏలూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజనాల రామమోహన్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బొడ్డు నోబుల్ ఆరోపించారు. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఓటు చోరీపై సంతకాల సేకరణలో భాగంగా కలిదిండి సెంటర్‌లో కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు.

### కుట్టు మిషన్ల పంపిణీ

కలిదిండి(కైకలూరు): భీమవరం రాజ్ ట్రస్ట్ నిర్వాహకులు గంటా రాజ్‌కుమార్, దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్ సహకారంతో మండలంలోని 26 మంది మహిళలకు కుట్టుమిషన్లు కలిదిండి ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం పంపిణీ చేశారు. దాతల సాయాన్ని పలువురు అభినందించారు.

### అంగన్‌వాడీ కేంద్రాలకు వంట పాత్రలు అందజేత



వంట పాత్రలను అందజేస్తున్న సేవాసంఘం సభ్యులు

గుడివాడ టౌన్: శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో సోమవారం అంగన్‌వాడీ కేంద్రానికి వంటపాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్ మాట్లాడుతూ సంఘం సభ్యుడు వి. సురేంద్రకుమార్, నరేష్ సహకారంతో స్థానిక నీలామహల్ రోడ్డులోని మున్సిపల్ ప్రైమరీ పాఠశాల(అల్లంబడి) అంగన్‌వాడీ కేంద్రానికి ఈ వంటపాత్రలు అందజేశామన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యుడు బొగ్గారపు తిరుపతయ్య, జాజుల తాతారావు, పాఠశాల హెచ్‌ఎం బి. నాగరాజేశ్వరి పాల్గొన్నారు.

## ప్రత్యేక యాగంలో పాల్గొన్న కైలే అనిల్‌కుమార్



ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పామర్రు: స్థానిక విజయవాడ రోడ్డులోని ఆరేపల్లి కల్యాణ మండపంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆరేపల్లి నాగ రమేష్, రాణి దంపతులు, వైఎస్సార్ సీపీ యూత్ నాయకుడు ఆరేపల్లి రాకేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక యాగం కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్యాణ మండపానికి ఆధునిక హంగులను అద్ది పునఃప్రారంభించడం అభినందనీయమన్నారు. అందరూ సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎండీ హస్మతుల్లా, కూసం పెద వెంకటరెడ్డి, బొమ్మారెడ్డి అప్పిరెడ్డి, ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, సజ్జా సుబ్రమణ్యం పాల్గొన్నారు.

## పెట్టుబడులను ఆకర్షించడం ఒక కళ



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న రాజశేఖరరెడ్డి

గుడివాడ టౌన్ : ఒక సంస్థ లేదా వ్యాపారంలో పెట్టుబడులు ఆకర్షించడం.. వాటి ద్వారా అభివృద్ధి చెందడంపై విద్యార్థి దశ నుంచే దృష్టిపెట్టాలని సెక్యూరిటీ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా ట్రైనర్ జి. రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఏఎన్నార్ కళాశాల్లో ప్రపంచ పెట్టుబడిదారుల వారోత్సవం 2025ను పురస్కరించుకుని ఎంబీఏ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో పెట్టుబడి రంగంలో అనేక ఉపాధి అవకాశాలు ఉత్పన్నమవుతాయన్నారు. వాటిని అందిపుచ్చుకోవడం కోసం విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రయత్నాలు ప్రారంభించాలన్నారు. బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగాల్లో రాణించేందుకు పోటీపరీక్షలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, ఎంబీఏ హెచ్‌ఓడీ ఎంబీ సువర్చల, అధ్యాపకురాలు ఎ. గ్రీష్మ తదితరులు పాల్గొన్నారు.

## పంట నమోదు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

గుడివాడ టౌన్ : వరి నాట్లు వేసి రెండు నెలలు పూర్తవుతున్న సందర్భంగా పంట నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు శొంఠి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతుసంఘం బృందం గుడివాడ పరిసర ప్రాంతాల్లో పర్యటించామని తెలిపారు. పంట నమోదు ప్రక్రియ 60 శాతానికి మించలేదన్నారు. త్వరితగతిన రైతులు పంట నమోదు చేసుకోవాలని అందుకు వీఏఏలు సహకరించాలన్నారు. ఈకేవైసీ పూర్తి చేసుకోవాలన్నారు. 10 రోజులుగా ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో పలు రకాల పంటలకు సంబంధించి చీడ బెడదలను రైతులు ఎదుర్కొంటున్నారన్నారు. వ్యవసాయాధికారులు క్లోరో 50, ఎంట్రాకాల్, క్లోరిపైరిపాస్, మోనో క్రోటోఫాస్ పురుగుమందులను సబ్సిడీపై అందజేయాలన్నారు. ఎలుకల నివారణ మందు కూడా రైతులకు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం సభ్యుడు నీలం మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా సెరిబ్రల్ పాల్సీ డే



మాట్లాడుతున్న యూనియన్ బ్యాంక్ మేనేజర్ ధనకుమార్

ఎలకుర్రు(పామర్రు): ఎలకుర్రు గ్రామంలోని కాశీనాథుని దుర్గాంబ బుచ్చయ్య ట్రస్టు(కేడీబీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసిక దివ్యాంగుల డే కేర్ సెంటర్‌లో ప్రపంచ సెరిబ్రల్ పాల్సీ డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక యూనియన్ బ్యాంక్ మేనేజర్ ధనకుమార్ మాట్లాడుతూ చిన్నారుల్లో అంగవైకల్యం రావడానికి బిడ్డ తల్లి గర్భంలో ఉన్నప్పుడు ఆ తల్లికి ఉన్న ఇన్‌ఫెక్షన్ శిశువునకు సంక్రమించి ప్రామిటివ్ బేబీస్ జననం జరుగుతుందన్నారు. మేనరికం పెళ్లిళ్ల వలన, ప్రీ–మెచ్యూరిటీ డెలివరీలతో ఈ వైకల్యం వస్తుందన్నారు. గర్భిణులు వ్యాధి నిరోధక టీకాల ద్వారా కొన్ని వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. అనంతరం దివ్యాంగులైన చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు కాశీనాథుని నాగేశ్వరరావు, కాలేజీ ప్రిన్సిపాల్ ప్రసన్నకుమారి, ఫిజియోథెరపీ వైద్యులు డాక్టర్ నరేష్, స్పీచ్ ట్రైనర్ సుష్మ పాల్గొన్నారు.

## పరిశోధనలో అంశాలు తెలియజేయాలి



రంగవల్లులతో గ్రామ స్వరూపాన్ని వివరిస్తున్న విద్యార్థినులు

కాజ(మొవ్వ): రైతులు చేపట్టే సేద్య పద్ధతుల పరిశోధనలో వెలువడిన సాంకేతిక సమాచారాన్ని విద్యార్థినులు రైతులకు అందజేయాలని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ సుధారాణి సూచించారు. గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా మొవ్వ మండలం కాజ గ్రామంలో సోమవారం బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు రైతులకు వ్యవసాయంలో తాజాగా వస్తున్న సాంకేతిక మార్పులు, లాభసాటి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ప్రాంగణంలో రంగవల్లులతో గ్రామ స్వరూపాన్ని, గ్రామాల్లో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసే పంటలకు సంబంధించిన అంశాలను ఆకర్షణీయంగా చిత్రీకరించి గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ రేవతి, డాక్టర్ వెంకట లక్ష్మి, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

## నెమలి వాహనంపై శ్యామలాంబ ఊరేగింపు



కైకలూరులో నెమలి వాహనంపై శ్యామలాంబ తల్లి ఊరేగింపు

కైకలూరు: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా కైకలూరు శ్యామలాంబ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో నెమలి వాహనంపై సోమవారం ఊరేగించారు. గత నెల 22 నుంచి ఈ నెల రెండో తేదీ వరకు అమ్మవారి ఆలయంలో చండీ మహాయాగ సహిత దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత ఘనంగా జరిగాయి. ఆలయ ఈఓ వీఎన్‌కే.శేఖర్ మాట్లాడుతూ మంగళవారం వేదసభ, 12న అన్నసమారాధన జరుగుతుందన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు రామలింగరాజు, రాంబాబు, సుజాత, వెంకట అంజని, నాంచారయ్య, సుబ్రహ్మణ్యశర్మ, ఉషారాణి, గౌరీశ్రీ, దుర్గా ప్రసాద్, ఆలయ సిబ్బంది చుక్కా శ్రీనివాసరావు, ప్రసాద్, రాంబాబు పాల్గొన్నారు.

కైకలూరు శిరిడీ సాయిబాబా మందిరంలో బాబా దసరా దశావతారాలు ఘనంగా ముగిశాయి. వివిధ వేషధారణాలు, భక్తి పాటలు, భజనలు, కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

### జీఎస్టీపై అవగాహన



డిగ్రీ కాలేజీలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీలత

కైకలూరు: కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులకు జీఎస్టీ 2.0పై సోమవారం అవగాహన కల్పించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీలత మాట్లాడుతూ ఈ నెల 13 వరకు జీఎస్టీపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వం పోటీలు చేపడతామన్నారు. కాలేజీ కామర్స్ అధ్యాపకులు నున్న శ్రీనివాసరావు జీఎస్టీ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు జరిగిన పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అడపా కేదారి, అధ్యాపకులు అబ్దుల్ సఫార్, వేదాంతం, ఎం.హరిప్రసాద్, సంధ్య, ఎం.విజయ్‌కుమార్, ప్రసూనాంబ, రంగమణి, రేణుక పాల్గొన్నారు.

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎలకుర్రు(పామర్రు): బాధిత కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ ఎంతో అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండలంలోని ఎలకుర్రు గ్రామంలో బాధిత కుటుంబానికి సోమవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యానికి గురై వైద్యసేవలు పొందిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఆసరాగా సీఎంఆర్‌ఎఫ్‌ను అందజేస్తోందని తెలిపారు.